# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 02 జులై, 2026 | పేజీలు : 7


## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ప్రేమ్‌కరణ్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నంద్యాల ప్రేమ్ కరణ్ రెడ్డి ఈరోజు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నల్లగొండ ఆర్‌డివో యారాల అశోక్ రెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆయన స్థానంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారిగా పనిచేస్తున్న ప్రేమ్ కరణ్ రెడ్డికి అదనంగా బా ధ్యతలు అప్పగించారు. స్థానిక సంస్థల మీద లోతైన అవగాహన ఉన్న ప్రేమ కరణ్ రెడ్డికి బాధ్యతలు అప్పగించడం వల్ల స్థానిక సంస్థల్లో పనులు వేగవంతం కానున్నాయి.



నల్లగొండ




సూర్యాపేట




యాదాద్రి భువనగిరి

వివరాలు మెయిన్‌లో

**ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముందు సిపిఐ ధర్నాలు.**

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతం చేయాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ కోరారు. బుధవార్ సర్ పై విసి కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జూన్ 25 నుండి బిఎల్‌ఓలు ఇంటింటిని సందర్శిస్తున్నార న్నారు. ఇందులో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎన్యుమరేషన్ ఫామ్స్ డిస్ట్రిబ్యూషన్ 88శాతం పూర్తి అయిందన్నారు. ఈ కార్యక్రమం సవ్యంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జూన్ 25 నుండి జులై 24 వరకు బిఎల్‌ఓల ఇంటింటి సందర్శన చేస్తున్నారని చెప్పారు. జులై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ఉంటాయని, జులై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, జులై 31 నుండి ఆగష్టు 30 వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. జులై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని, తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, సి సెక్షన్ సూపర్డెంట్ రాజేందర్ రెడ్డి, ట్రైనింగ్ డిప్యూటి కలెక్టర్లు రవితేజ, అనూష, రాజకీయ పార్టీల నాయకులు చల్లమల్ల నరసింహ, హబీబ్, చకిలం రాజేశ్వర్ రావు, ఎం. స్టాలిన్, సత్యనారాయణ పాల్గొన్నారు.





## ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు

ప్రజాపక్షం/కోదాడ: వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలకు వరదనీటి వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలువల పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని 34వ వార్డు పరిధిలో ఎర్రకుంట వాగు కాలువ పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ రమాదేవి, స్థానిక కౌన్సిలర్ గంధం బాలేంద్ర పాండులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడినప్పుడు వరద నీరు సాఫీగా సాగిపోయేలా ముందస్తుగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సూత్రాలను పాటించాలి



ప్రజాపక్షం/కోదాడ: ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలను పాటించాలని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అదిరోహించాలని పట్టణ ప్రముఖ వైద్యుడు జాస్తి సుబ్బారావు అన్నారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ఎం సంకల్ప్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పట్టణంలోని వారి ఆసుపత్రికి వెళ్లిన విద్యార్థులు, ఉపాధ్యాయులు డాక్టర్లకు పుష్పగుచ్చాలు అందించి డాక్టర్స్‌డే దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తికి ఉన్న ప్రాధాన్యతను, ప్రజలకు అందించే సేవలపై వారికి వివరించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలను పాటించాలని, చిన్నతనం నుండే మంచి లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. భవిష్యత్‌లో దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

## వైద్యులు సమాజానికి నిజమైన ఆదర్శం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రాణాలను నిలబెట్టే మహోన్నత సేవ అందిస్తున్న వైద్యులు సమాజానికి నిజమైన ఆదర్శమని లయన్స్‌క్లబ్ హాస్పటల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, క్లబ్ జిల్లా అధ్యక్షుడు యాద కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 20వ వార్డు జమ్మిగడ్డలో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులు వూర రామ్మూర్తి, విద్యాసాగర్, జశ్వంత్, తోట కిరణ్, పెద్దిరెడ్డి మహేష్, అలేఖ్య, సుమలను శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చికూరి కృష్ణ, మిర్యాల వెంకటేశ్వర్లు, గుడిపూడి వెంకటేశ్వరరావు, తోట శ్యామ్, మిర్యాల సుధాకర్, బండారు రాజా, కుమ్మరికుంట్ల లింగయ్య, బైరు వెంకన్న గౌడ్, కొండ సంతోష్, హరి, ఫణికుమార్ పాల్గొన్నారు.




# వృత్తి విద్యా శిక్షకులను ఆదుకోవాలి




ప్రజాపక్షం/నడిగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1900 మంది వృత్తి విద్యా శిక్షకులు (ఒకేషనల్ ట్రైనర్స్) గత కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఈ శిక్షకుల కుటుంబాలు ప్రస్తుతం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయని, రీ ఎంగేజ్ ఉత్తర్వులు సకాలంలో రాకపోవడం వల్ల వారి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. శిక్షకుల ఆర్థిక సమస్యలు ఒక పక్క, జీతాల జాప్యం వారి జీవితాలు అంధకారంగా మారుతున్నాయి. మధ్యవర్తి ఏజెన్సీల ద్వారా జీతాల చెల్లింపులు జరగడం వల్ల శిక్షకులకు నెలల తరబడి వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు సమయానికి అందకపోవడం వల్ల కుటుంబ పోషణ, పిల్లల చదువులు, నిత్యావసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని అన్నారు. ఏటా సెలవుల సమయంలో వచ్చే ఆర్థిక ఇబ్బందుల వల్ల అనేక కుటుంబాలు అప్పుల పాలు అవుతున్నాయని మళ్లీ అకాడమిక్ ఇయర్ ప్రారంభం అయ్యే నాటికి కుటుంబ పోషణ భారం అవుతుందని తెలిపారు. తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నప్పటికీ ఆర్థిక భద్రత లేకపోవడం వారిని తీవ్ర ఆవేదనకు గురి చేస్తుందని బాధను వ్యక్తం చేస్తున్నారు. లేని పక్షంలో తప్పని సరి పరిస్థితుల్లో నిరవధిక సమ్మెకు వెళ్లక తప్పదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# కోదాడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 'ఆపరేషన్ రోప్'




ప్రజాపక్షం/కోదాడ: పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు పాదచారుల భద్రత కోసం కోదాడ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ సిబ్బంది సహకారంతో కోదాడలోని రంగా థియేటర్ చౌరస్తా నుండి సూర్యాపేట రోడ్డు వరకు ఇరువైపులా ఉన్న అక్రమణలను తొలగించారు. పుట్ పాత్‌లను అక్రమించి ఏర్పాటుచేసిన నెట్టుడు బండ్లు, ఇతర దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించడం జరిగింది. భవిష్యత్‌లో వ్యాపారులు మళ్లీ పుట్‌పాత్‌లను అక్రమించుకుండా ఉండేందుకు వీలుగా దుకాణాల ముందు స్పష్టమైన రెడ్‌లైన్ (ఎరుపు గీత) గీశారు. వ్యాపారస్తులు ఎవరు కూడా ఈరెడ్ లైన్ దాటి ముందుకు రాకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు రోడ్ల విస్తరణకు ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

# ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ఏఐఐఈఏ నిరంతరం పోరాటం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు తమ అసోసియేషన్ నిరంతరం పోరాడుతుందని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సూర్యాపేట బ్రాంచి అధ్యక్షులు ఎల్. మోహన్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డు ఎల్ఐసి కార్యాలయం వద్ద బుధవారం అసోసియేషన్ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనియన్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. భీమా రంగాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని అందుకోసం యూనియన్ పోరాడుతుందన్నారు. ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉండి సమిష్టి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. హక్కులను కాపాడుకునే దిశగా యూనియన్ రాజీలేని పోరాటాలు చేస్తుందని అనేక పోరాటాల ఫలితంగానే తమ హక్కులను సాధించుకున్నామని తెలిపారు. యూనియన్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఉద్యోగుల పక్షాన అనేక పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఐఈఏ కార్యదర్శి డి. ప్రభాకర్, నాయకులు కె. రామయ్య, బి. శంకర్, ఎం. సంజీవయ్య, జి. బిక్షం, వి. శివకుమార్, ఎం. రవీందర్, సందీప్, సువర్ణ, హరిశంకర్, అరుణ పాల్గొన్నారు.

# విబిజి రామ్‌జీ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి




ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : ఉపాధి కూలీలకు తీరని నష్టం కలిగించే విబిజి రాంజీ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, తెలంగాణ రైతు సంఘం మండల కమిటీల ఆధ్వర్యంలో విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని దేశవ్యాప్త పిలుపులో భాగంగా సూర్యాపేట ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు వారి ఆత్మగౌరవాన్ని పెంచేటువంటి చట్టంగా ఉందని యాంత్రీకరణ వచ్చిన తర్వాత యంత్రాల పని పెరిగి వ్యవసాయ రంగంలో కూలీల పనులు తగ్గించిన తర్వాత గ్రామాల నుండి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ఉపాధి హామీ రక్షణకై ఉద్యమాలు ఉధృతం చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఓకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకనబోయిన శేఖర్, వల్లపుదాసు సాయికుమార్, కొప్పుల రజిత, మేరెడ్డి కృష్ణారెడ్డి, పందిరి సత్యనారాయణ రెడ్డి, మేకనబోయిన సైదమ్మ పాల్గొన్నారు.



## అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు

ప్రజాపక్షం/చివ్వెంల : అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయిస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాధ్యతండ గ్రామంలో బానోతు జ్యోతి లాలు నాయక్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజక వర్గంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి రూ.5లక్షలు మంజూరు చేయించి సొంతింటి కల సాకారం చేస్తామన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సామూహిక జన్మదినోత్సవాలు



ప్రజాపక్షం/నడిగూడెం: పెన్షనర్లు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని సీనియర్ పెన్షనర్ ఎండి ఖలీల్ అహ్మద్ అన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జన్మదిన వేడుకలను విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్ల జన్మదినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు జరుపుకుంటున్న గట్టు వెంకటేశ్వరశాస్త్రి, ఎన్ఎస్‌పి రిటైర్డ్ ఉద్యోగులు బాణాల బిక్షం, మేకల లింగయ్య, బొళ్ల లక్ష్మమ్మ, చిత్తలూరి పద్మ, దున్న మేరమ్మ, బూరుగడ్డ శాంతమ్మ, దున్న రాములమ్మ, వందిటి విజయమ్మ, రెడ్డిపల్లి మంగమ్మ, మాచవరం అనసూర్యమ్మ, నామ మణెమ్మ వారి వారి గృహలను సందర్శించి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువాలతో సన్మానించి స్వీట్లు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు లావూరి బాలాజీనాయక్, బందారు నాగేశ్వరరావు, అలుగుబెల్లి అప్పారెడ్డి, రాంపల్లి వెంకటేశ్వర్లు, దున్న అంజయ్య, వేపూరి రాములు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతి

ప్రజాపక్షం/నడిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు స్కీములను, ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి చిక్కుళ్ల ఉపేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎల్. మంగాకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డు నుండి స్వయంగా సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలని తెలిపారు. సిఎస్‌సి హెల్త్ సంస్థ స్కీములను వెంటనే రద్దు చేయాలని, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయల సహాయం అందించాలని పేర్కొన్నారు. పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి గోలి వీరబాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేత



ప్రజాపక్షం/అర్వపల్లి : మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పాఠశాల నందు జాజిరెడ్డిగూడెం గ్రామ నివాసి శివసాయి సోలార్ ఎనర్జీస్ అధినేత బుద్దా శ్రీనివాస్ గుప్త తన కుమార్తె శ్రీవల్లి దేవసేన పుట్టిన రోజు సందర్భంగా సుమారు రూ.8వేల విలువైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలు నాయక్, పాఠశాల చైర్మన్ మేకల సునిత రాంబాబు, ప్రధానోపాధ్యాయురాలు బత్తిని స్వరూపారాణి, ఉపాధ్యాయులు శైలజ, రేణుక పాల్గొన్నారు.



## తహసీల్దార్‌కు సన్మానం

**ప్రజాపక్షం/నడిగూడెం:** నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ ఎల్ మంగాను వల్లాపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పిటిసి కిన్నెర నాగయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమెను కోరారు. పాలనకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బోళ్ల రాఘవరెడ్డి, బజ్జూరి అచ్చిరెడ్డి, నిండుచర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యుత్ షాక్‌కు గురై 10 సంవత్సరాల బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గోపాలపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం గ్రామానికి చెందిన తెప్పని అనిల్ పెద్ద కుమారుడు తెప్పని వర్ధన్‌బాబు(10) మంగళవారం సాయంత్రం వారి బంధువు అయినటువంటి తెప్పని రవి ఇంటి దగ్గర ఆటాడుకోవడానికి ఇంటిపైకి ఎక్కడానికి నిర్మించినటువంటి ఐరన్ మెట్లకు విద్యుత్ సరఫరా కాగా బాలుడు స్పృహతప్పి పడిపోగా బాబును వెంటనే హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే వర్ధన్ బాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విబిజి రామ్‌జీ పథకం రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విబిజి రాంజీ పథకం రద్దు చేయాలి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ కేంద్ర కమిటీల పిలుపు మేరకు మిర్యాలగూడలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను విరమించి, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విబిజి రాంజీ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌతమ్ రెడ్డి, రవినాయక్, రామ్మూర్తి, రమేష్ బాబు, కోట్ల శ్రీనివాస్ రెడ్డి, పద్మమ్మ, గోవిందరెడ్డి, రామకృష్ణ, కేశవులు, సూర్యం, దేశిరామ్‌నాయక్, వెంకటరెడ్డి, రవి, ఆశీర్వాదం, చారి, రామారావు, సైదులు, వెంకన్న, సీతారాములు పాల్గొన్నారు.



## పాఠశాల వాహనాలపై ఆర్‌టిఒ ప్రత్యేక తనిఖీలు




**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆర్టీవో అధికారులు బుధవారం కోదాడ పట్టణంలో పాఠశాల విద్యార్థులను రవాణా చేసే వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా పరిమితికి మంచి విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను గుర్తించి పలువురు డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ఫిటినెస్, పర్మిట్, ఇతర వాహన పత్రాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీవో అధికారి పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాల భద్రత అందరి బాధ్యతఅని పేర్కొన్నారు. ఆటోడ్రైవర్లు, యాజమానులు ఎలాంటి పరిస్థితుల్లోనూ అనుమతించిన పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, రహదారి భద్రత నియమాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. వాహనాల ఫిటినెస్, పర్మిట్, బీమా తదితర పత్రాలు ఎప్పటికప్పుడు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యాలు కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులు సూచించారు. తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుని ఒక ఆటోలలో ఐదుగురికి మించి విద్యార్థులను పంపించకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు బస్సులు లేదా ప్రత్యామ్నాయ రవాణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ జిలానీ, అసిస్టెంట్ ఎంవిఐ సతీష్, సిబ్బంది అశోక్, నాగేశ్వరరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

## చెవిలో పువ్వులతో బిఆర్‌ఎస్ నాయకుల వినూత్న నిరసన



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని బుధవారం బిఆర్ఎస్ నాయకులు చెవిలో పువ్వులతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతు భరోసా విషయంలో పూర్తిగా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుత వర్షాలుకురిసే పరిస్థితి లేక రైతులు భయంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతుంటే మరోపక్క రైతు భరోసా వేయకుండా కేవలం 1.2 ఎకరాల వారికే వేస్తున్నారని , మిగతా రైతుల పరిస్థితి ఏంటనీ ప్రశ్నించారు. ఆసర పెన్షన్లు రెట్టింపు చేస్తామని, వివాహమైన ప్రతి మహిళకు నెలకు 2500 ఇస్తామని, ప్రతి ఇంటికి 500 రూపాయలకే గ్యాస్ ఇస్తామని చెప్పి నేడు ప్రజలను మోసం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఏ హామీ నెరవేర్చాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రామ్ సైదులు, మన్సూర్‌అలీ, తక్కెళ్ల నాగార్జున, నాగుల్‌మీరా, సతీష్, సైదిరెడ్డి, శివనాయక్, రైతులు పాల్గొన్నారు.

## రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను త్వరగా మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పండి రాకేష్ మాట్లాడుతూ రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఆలస్యం చేయకుండా త్వరగా మంజూరు చేయాలని, లబ్ధిదారుల ఎంపిక కూడా ఎలాంటి రాజకీయ ప్రమేయాలకు తావు లేకుండా పారదర్శకంగా జరగాలని, అర్హులైన దళిత, పేద వర్గాలకు ఇండ్ల కేటాయింపు చేయాలని ఆయన అన్నారు. రాజకీయ ప్రమేయం వలన నిజమైన అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతుంది కాబట్టి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా మండల అధికారి ఆధ్వర్యంలో జరగాలని ఆయన అన్నారు. అదేవిధంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లకు పెండింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు వలిగొండ యాదయ్య, కట్టెల లింగస్వామి, మండల నాయకులు కట్టెల ప్రకాష్, గుండెపంగ మనోహర్, కట్టెల ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం..




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు విడుదల కాక వేలాది మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని పేర్కొంటూ, విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణ కోసం జూలై 2న నిర్వహించే కాలేజీల బంద్‌కు మద్దతు ఇవ్వాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థుల విద్యా హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ జూలై 2న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఫీజు రీయంబర్స్మెంట్ కోసం సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఫీజులు చెల్లించలేక చాలా మంది విద్యార్థులు చదువులు మానేస్తున్నారని, మరి కొందరు రుణాలు తీసుకొని విద్యను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, సమీర్, రాంబాబు యాదవ్, మీనాక్షి, మనీ చందు, కీర్తన, అయాజ్, మహిమ, యోగేశ్వర్, శ్రీనివాస్ నాగరాణి, కార్తీక్, తేజశ్రీ, శివశంకర్, శివాలోకేష్, మేఘన తదితరులు పాల్గొన్నారు.



## నిజాయితీతో సేవలందిస్తే ఆదర్శంగా నిలుస్తారు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీతో సేవలందించిన అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మునిస్పల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో పంచాయితీరాజ్ శాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాడిపల్లి మనోహర్ ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు. మనోహర్ తన ఉద్యోగ జీవితమంతా అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ శాఖ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగ బాధ్యతలకే పరిమితమని, సమాజ సేవకు మాత్రం అంతం కాదన్నారు. అనంతరం ఆయనకు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ఆర్థిక భారం మోపుతున్నాయని, దీనిని వెంటనే అరికట్టాలని బిజేపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కోదాడ మండల విద్యాధికారి సలీం షరిఫ్‌ను కలిసి బిజేపి మండల అధ్యక్షులు గాదరి పుల్లారావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజేపి నాయకులు మల్లెబోయిన వెంకటేష్‌బాబు, భూమా శ్రీనివాస్ లు మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్, ట్యూషన్ ఫీజులతో పాటు పుస్తకాలను, యూనిఫాంలు రవాణా పేర్లతో భారీగా వసూలు చేస్తూ, పేద మధ్య తరగతి కుటుంబాల నడుము విరుస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మనందారెడ్డి, నాగరాజు, గోపి పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలలో పిజి, పిహెచ్‌డి విద్యనభ్యసించే మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్) విద్యార్థుల కొరకు (స్ప్రింగ్ సీజన్ 2026) 01.01.2026 నుండి 30.06.2026 వరకు విశ్వ విద్యాలయాలలో ప్రవేశం తీసుకొని ఉన్న విద్యార్థులు వారి కుటుంబ ఆదాయం రూ.5లక్షల లోపు గల వారు అర్హులు వీరి నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కె. దయానంద రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా పేర్కొనబడిన కోర్సులకు వెబ్సైట్ www.telanganaepass.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 15 సాయంత్రం 5 గంటల వరకు గడువు పొడిగించినట్లు వివరించారు. అర్హత గల మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకొనగలరని ఆమె కోరారు. ఇతర వివరాల కొరకు సూర్యాపేట మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఎస్‌సి విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించుటకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహించబడుతున్న అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం (ఏ.ఓ.వి.ఎన్) స్కాలర్‌షిప్ దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా తేది.01.07.2026 నుండి 31.08.2026 వరకు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారిణి కె. దయానంద రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యు.ఎస్.ఏ, యూకె, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చదవలనుకునే ఎస్‌సి విద్యార్థులు ఆగష్టు 31 లోపు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




## మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వేసవి సెలవుల్లో జనగణన కార్యక్రమంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులకు రెమ్యూనరేషన్ చెల్లించి, డ్యూటి సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ టిఎస్ యూటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం బుధవారం నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ నాగరాజు కు వినతి పత్రం అందజేశారు. జనగణన విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన పారితోషికం, డ్యూటి సర్టిఫికెట్లు ఎలాంటి జాప్యం లేకుండా అందజేయాలని సంఘం ప్రతినిధులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యూటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు ఆర్.శ్రీనయ్య, సీనియర్ నాయకులు ఎన్.నర్సింహారావు, కె.వెంకటేశ్వరరావు, మండల ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఎన్.వెంకటేశ్వర్లు, ఎం. యాదగిరి, ఎం.జానకిరాములు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పి ధరలకే ఎరువులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి ఎం.ఋష్యేంద్రమణి సూచించారు. బుధవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల నమోదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా డిఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, యూరియా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో కేకే ట్రేడర్స్‌కు చెందిన రమేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ పరిధిలోని హిల్ కాలనీలో శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహించిన 52వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అన్నప్రసాద వితరణతో ఘనంగా ముగిశాయి.ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మంచికంటి కిషోర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నాగార్జునసాగర్ జెన్కో చీఫ్ ఇంజనీర్ మంగేష్ కుమార్, ఇన్‌చార్జి సూపరింటెండింగ్ ఇంజనీర్ బాల్ రెడ్డి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివకుమార్, సాగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్, ఎస్ఐ సతీష్ ప్రారంభించారు.



# జిల్లా కలెక్టర్ లెక్కల మాస్టారైన వేళా!



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఆయన జిల్లాకు బాస్, నిత్యం ఫైళ్లు సమీక్షలతో బిజిగా ఉంటారు. కాని ఒక్కసారిగా కలెక్టర్ తన హోదాను పక్కన పెట్టి లెక్కల మాస్టార్ అవతారమెత్తి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించారు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ నేరుగా తరగతి గదిలోకి వెళ్లారు. అక్కడ విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. చదువు ఎలా సాగుతుంది. ఉపాధ్యాయులు సరిగా వస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు గణితంలో ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా బ్లాక్ బోర్డు దగ్గరకు వెళ్లి విద్యార్థులకు లెక్కలు బోధించారు. కష్టమైన సూత్రాలను సులభంగా ఎలా గుర్తుంచుకోవాలో వివరించారు.
కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, విద్యార్థులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్ ఓపిగ్గా నివృత్తి చేశారు. చదువుపై ఏకాగ్రత ఉంచాలి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా బడికి రావాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. మద్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పనపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదోడి సొంతింటి కల తీర్చిన ఘనత కాంగ్రెస్ దే



**ప్రజాపక్షం/హాలియా:** పేదోడి సొంతింటి కల తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మూడో వార్డు కౌన్సిలర్ కుందూరు వెంకటరెడ్డిలు అన్నారు.అర్హులైన ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమాన్ని 9వ వార్డులో బుధవారం ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ చిరకాల వాంఛ అయిన ఇంటి నిర్మాణాన్ని చేపట్టుకోవాలని తెలిపారు.సాగర్ నియోజకవర్గం గతంలో ఎన్నడూ లేని విధంగా పేదలందరికీ ఇళ్లను మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు బొంగరాల ఏసు రాజు,దీపావత్ ప్రసాద్ నాయక్,కోఆప్షన్ సభ్యురాలు కొమ్మనబోయిన జయమ్మ,కరుణాసాగర్,పొదిలి కృష్ణ, బాబు దిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నీటిని పొదుపు చేసుకొని భూగర్భ జలాలను అభివృద్ధి చేయడం కోసం ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి శేషగిరిశర్మ సూచించారు. జల్ సంజయ్ జన్ భాగిదారి నీటిని పొదుపు చేద్దాం పొదుపు చేయడంలో భాగస్వామ్యాన్ని పాటిద్దాం అనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తి వీరప్పగూడెం నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి అధ్యక్షత వహించగా, సర్పంచ్ అందుగుల వెంకటయ్యతో కలిసి ఎంపీడీఓ శేషగిరిశర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ నరసింహాచారి, ఈసీ కళావతి, ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, దామోదర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పేలపోలు శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆస్మా, టెక్నికల్ అసిస్టెంట్ రేణుక, గ్రామ పెద్దలు లతీఫ్, సత్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, జల్‌రామ్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని జిల్లా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాక మల్లేష్ యాదవ్ అన్నారు. బుధవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం శిల్పారామం వేదికగా వానాకాల పంట రైతులు నాట్లు మొదలు పెడుతున్న నేపథ్యంలోనే తనవంతుగా రైతులకు భరోసాగా ఉంటూ రైతు భరోసా నిధులను విడుదల చేయడం హర్షనీయమని కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షేమంతో పాటు అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా తెలంగాణను అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సారధ్యంలో గత రబిసీజన్ ధాన్యం కొనుగోలులో ఎన్ని ఇబ్బందులు వచ్చినా కూడా రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేసి 48 గంటల్లో డబ్బులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ బోడిగే శంకరయ్య, మండల నాయకులు టింగిల్ కార్ వెంకటేష్, కంటే లింగస్వామి, పానగంటి లింగస్వామి, బుర్రి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



## అక్రమ మట్టి రవాణా...

### అధికారులు ఎందుకు మౌనం...?

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలో భారీ ఎత్తున అక్రమంగా మట్టి తరలింపు జరుగుతోందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఒక మండలం నుంచి మరో మండలానికి ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండానే మట్టి రవాణా జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద స్థాయిలో మట్టి తరలింపు జరుగుతుంటే సంబంధిత అధికారులకు కనిపించడం లేదా..? లేక చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా...? ప్రభుత్వ నిబంధలను భేఖతారు చేస్తూ ప్రకృతి సంపదను అక్రమంగా తరలిస్తే దాని వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం.. పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుంది. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత రెవిన్యూ, మైనింగ్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని, అక్రమ మట్టి రవాణాను వెంటనే నిలిపివేయాలని కోరుతున్నారు.

## వ్యర్థాలు వేరు చేయడంపై అవగాహన



**ప్రజాపక్షం/హాలియా:** సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్2026 అములులో భాగంగా హాలియా మున్సిపాలిటీలోని ఆరవ వార్డులో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు.మున్సిపల్ కమీషనర్ రవీందర్ రెడ్డి బుధవారం ఆరవ వార్డులో సోర్స్ లెవెల్ సెగ్రిగేషన్( మూలం లోనే వ్యర్థాలను వేరు చేయడం)పై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి వెలువడే వ్యర్థాలను తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, హానికర వ్యర్థాలను వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలని తెలిపారు.తడి వ్యర్థాలతో ఇంటి వద్దే సేంద్రియ ఎరువు తయారు చేసుకోవచ్చని,పొడి వ్యర్థాలను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మున్సిపాలిటీ పరిశుభ్రతకు తోడ్పడాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఆరవ వార్డ్ కౌన్సిలర్ బొంగరాలు ఏసు రాజు,పర్యావరణ ఇంజినీర్ రవికుమార్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆపన్న హస్తం



**ప్రజాపక్షం/నందికొండ :** పెద్దవూర మండలం నాయనవానికుంట గ్రామానికి చెందిన జర్నలిస్టు కత్తి శ్రీనివాస్ రెడ్డి లుకేమియా (రక్త క్యాన్సర్)తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న బుధవారం నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు.ఈసందర్భంగా చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అనంతరం పాండన్న మాట్లాడుతూఆపదలో ఉన్న శ్రీనివాస్ రెడ్డికి సాగర్ ప్రాంత ప్రజలందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆయనకు అండగా నిలవాలని కోరారు.శ్రీనివాస్ రెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.ఈసందర్భంగా కుటుంబ సభ్యులు,సన్నిహితులు పాండన్నకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఓటరు నమోదు సర్వే తనిఖీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు విస్తృత సవరణ సర్వేను బుధవారం ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చైతన్య నగర్, రామచంద్రగూడెం పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఓటరు గణన ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం 1987కు ముందు ఓటరుగా నమోదైన వారు స్వీయ గుర్తింపు కార్డు, 19872004 మధ్య నమోదైన వారు తమ గుర్తింపు కార్డుతో పాటు తల్లిదండ్రుల ఆధార పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. బీఎల్ఓలు క్షేత్ర స్థాయిలో తప్పుల్లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని, ఇందుకు స్థానిక ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, సూపర్వైజర్లు , బీఎల్ఓలు పాల్గొన్నారు.

# ఫ్రెషర్స్ వేడుకలు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన స్వాగతం లో నూతన విద్యార్థులు సీనియర్ విద్యార్థులతో కలిసిమెలిసిపోవటానికి ఒకరినొకరు స్వేచ్ఛ భావంతో స్నేహబంధం భావంతో మెదలడానికి ఆరోగ్య వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు ఫ్రెషర్స్ డే ఒక చక్కని వేదిక అని స్కూల్ కరస్పాండెంట్ వంగూరి పాండు అన్నారు. మంచి చదువుతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ఉన్నత శిఖరాలకు చేర్చే లక్ష్యంతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇంచార్జ్ స్వాతి సీనియర్ ఉపాధ్యాయులు దేవరకొండ దయాకర్ చారి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన సర్పంచ్ నగేష్

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండలం పేర్వాల గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ నగేష్ దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ సూచనతో తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు వారి పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు, నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులు అనిల్, పెద్ద వెంకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల స్థానిక పోలీస్ స్టేషన్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్ రికార్డులను, కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ నిర్వాహణ, పెండింగ్ కేసులు, మౌలిక వసతులు, శాంతి భద్రతల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు పారదర్శక, నాణ్యమైన సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకుఓవాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నేరాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. అనంతరం గుండాల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) శోభన్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది క్రమశిక్షణతో, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న తీరును జిల్లా ఎస్పి అభినందించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఇదే నిబద్ధతతో కొనసాగాలని సూచించారు. ఈ తనిఖీలలో డిఎస్పి శ్రీనివాస్‌నాయుడు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్‌ఐ శోభన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.




# అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని తహశీల్దార్ రాజశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమంపై మండలంలోని వివిధ గ్రామాల బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ఓటు హక్కు ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఓ సూపర్‌వైజర్స్ రాధ, అజీజ మున్నిసా బేగం, నవీన్, శ్రీను, వివిధ గ్రామాల బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# హామీలు గాలికొదిలేసి..సభలు,ప్రచారాలేనా?

**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సభలు, ప్రచార కార్యక్రమాలతో కాలం గడుపుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు.బుధవారం కట్టంగూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా,ఎరువుల సరఫరా,పంటల కొనుగోలు,సాగునీటి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.రైతులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన రైతు సంక్షేమ పథకాలు,సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు.ప్రచార కార్యక్రమాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని, రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో కట్టంగూరు మాజీ జెడ్పిటీసీ తరాల బలరాం,మాజీ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి,అయిటిపాముల సర్పంచ్ బెల్లి సుధాకర్,నాయకులు నోముల వెంకటేశ్వర్లు,దాసరి సంజయ్, తండు కృష్ణ,కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# బంద్ పేరిట విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యాసంస్థల బంద్ల పేరుతో పిల్లల చదువులకు ఆటంకం కల్పిస్తే బహుజన్ సమాజ్ పార్టీ చూస్తూ ఊరుకోదనీ ఆపార్టీ భువనగిరి పార్లమెంటు ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు యూకేజీ నుండి ఉన్నత విద్య వరకు కోట్లాది మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నాయి. విద్యార్థుల హక్కులు, సంక్షేమం, విద్యా సమస్యల పరిష్కారం కోసం వివిధ రాజకీయ పార్టీల అనుబంధంగా అనేక విద్యార్థి సంఘాలు పనిచేస్తున్నాయనీ అయితే, విద్యార్థుల సమస్యల పరిష్కారం పేరుతో తరచూ విద్యాసంస్థలను బంద్ చేయడం, విద్యార్థులను తరగతులకు దూరం చేయడం, విద్యా వ్యవస్థకు అంతరాయం కలిగించడం వంటి చర్యలు విద్యార్థుల విద్యాభవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ అభిప్రాయపడినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ అయితరాజు అభియందార్, భువనగిరి జిల్లా కోశాధికారి మీసాల సైదులు, నియోజకవర్గ నాయకులు కుమార్ శ్రవణ్ పాల్గొన్నారు.

# నాఫెడ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల రైతు మహిళా ఉత్పాదక సంఘం (ఎఫ్‌పివో) ఆధ్వర్యంలో, నాఫెడ్ సంస్థ సహకారంతో రైతులకు కందుల సాగు, నాణ్యత పరిరక్షణ మరియు మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నాఫెడ్ ప్రతినిధులు మాట్లాడుతూ రైతులకు సంవృద్ధి పోర్టల్‌లో నమోదు విధానం, కందులను సరైన సమయంలో కోయడం, శాస్త్రీయ పద్ధతుల్లో నిల్వ చేసుకోవడం, నాణ్యతను కాపాడుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కో ఆపరేటివ్ చైర్మన్, అడిషనల్ డిఆర్‌డివో జంగారెడ్డి, డిపిఎం రవీందర్‌రెడ్డి, ఇక్రిశాట్ అధికారి, ఏవో సూరజ్, సర్పంచ్, ఉప సర్పంచ్ ఏఈవో, జిల్లా అధికారులు, నాఫెడ్ ప్రతినిధులు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, మండల ఏపిఎం వెంకటేశ్వర్లు, పక్కిరయ్య, మండల రైతు మహిళా ఉత్పాదక సంఘం సీఈవో సజిత, ఏపిఎంలు, సిసిలు, మహిళ రైతులు, రైతులు పాల్గొన్నారు

# మానవత్వాన్ని చాటుకున్న దైద కృష్ణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన నర్సిరెడ్డికి నల్గొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో తుంటి ఎముక శస్త్రచికిత్స నిర్వహించాల్సి ఉండగా, అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయంపై మిర్యాలగూడ పట్టణంలోని 35 వ వార్డుకు చెందిన దైద కిరణ్ సమాచారం ఇవ్వగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు వ్యక్తిగత సహాయకులు దైద కృష్ణ స్పందించారు. వెంటనే నల్గొండలోని హాస్పిటల్‌కు చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేసి తన సేవా తత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తాన్ని అందించి అండగా నిలిచిన దైద కృష్ణను బాధితుడి కుటుంబ సభ్యులు, కాలనీ నాయకులు తదితరులు అభినందించారు.

# అధిక ఫీజులు వసూలు సరైంది కాదు

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ఆర్థిక భారం మోపుతున్నారని బిజెపి సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు అన్నారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారికి అధిక ఫీజలను అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకూలి పనికిపోయి సంపాదించుకున్న డబ్బులను వారి ఆరోగ్యాలను లెక్కచేయకుండా వాళ్ల పిల్లలను చదివించాలనే సంకల్పంతో ప్రైవేట్ పాఠశాలలకు పంపుతుంటే దానిని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆసరాగా తీసుకొని పేద ప్రజల నుండి రక్తం పీల్చుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్స్, టై, బెల్టులు, డైరీ అని వేలకు వేలు డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల పర్మిషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాదరి పుల్లారావు, నాయకులు భూమా శ్రీనివాస్, బ్రహ్మానంద రెడ్డి, నాగరాజు, గోపి పాల్గొన్నారు.

# బికెఆర్ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** విద్య, క్రీడాభివృద్ధికి బద్దం కోటిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (బికెఆర్) అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. బుధవారం మండలంలోని కొమరబండ ఉన్నత పాఠశాల విద్యార్థుల క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. బికెఆర్ ట్రస్ట్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బికెఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బద్దం భద్రారెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యలోనూ క్రీడలను తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేశ్వరి, స్థానిక కౌన్సిలర్ మామిడి రామారావు, మత్స్యశాఖ సొసైటీ వైస్ చైర్మన్ దేవపొంగు ముత్తయ్య, డైరెక్టర్లు బత్తుల కిట్టు, నాగులు, మహంకాళి సీతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్‌బిఐ 71వ అవతరణ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/దేవరకొండ;** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 71వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఎస్‌బిఐ గుడిపల్లి శాఖలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడిపల్లి శాఖ ఆవరణలో మేనేజర్ అనిల్, ఎస్‌బిఐ ఓబిసి రాష్ట్ర అధ్యక్షులు, ఏవో నల్గొండ ఎస్‌బిఐఎస్‌యూఎస్‌సి ఓబిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్‌విటి సిబ్బంది మరియు ఖాతాదారులతో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐ కాలంలో స్టేట్ బ్యాంక్ అందిస్తున్న డిజిటల్ సేవలు అన్నింటిని కూడా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా నారాయణగౌడ్

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కలపురం నూతన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులుగా పొన్నగాని నారాయణ గౌడ్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మొగులయ్య, ప్రధాన కార్యదర్శిగా అయోధ్య, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా అశోక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆదినారాయణ, సోషల్ మీడియా కన్వీనర్గా రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త, నాయకులు బిక్షంగౌడ్, రాంరెడ్డి, వెంకన్న గౌడ్, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై కందుల విత్తనాలు పంపకం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సబ్సిడీపై కందులు 0.72 క్వింటాలు రైతులకు నారాయణపురం రైతు వేదికలో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారిని బి పూజ తెలిపారు.కందులు రకము PRG 176 4kg పాకెట్ మొత్తం ధర రూ. 520, సబ్సిడీ రూ. 120, రైతు చెల్లించాల్సిన ధర రూ. 400. రైతులు పట్టా పాస్ పుస్తకం మరియు తమ ఆధార్ తో రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులను విత్తనాలు తీసుకోవాల్సిందిగా కోరారు.

## 'సర్' విధానాన్ని పరిశీలన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఖుదాబాక్స్ పల్లి గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ 20 26 ఎన్యూమరేషన్ ఫారాలు నింపే విధానాన్ని బుధవారం తాసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు గ్రామంలో పరిశీలించారు.బిఎల్ ఓ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాల నా మోదు ప్రక్రియను తనిఖీ చేసి బిఎల్‌వో లకు పలు సూచనలు చేశారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ జయ లక్ష్మి పాండు గౌడ్,మాజీ జెడ్పిటిసి పాశం సురేందర్ రెడ్డి,రెవిన్యూ సిబ్బంది,గ్రామ ప్రజలు కొన్నారు.

## ఘనంగా ఏఐఐఈఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ రంగ భీమా సంస్థల పరిరక్షణ,ఉద్యోగుల హక్కుల సాధన లక్ష్యంగా పనిచేస్తున్న దేశంలోని అతిపెద్ద, పురాతన ట్రేడ్ యూనియన్ అయిన అఖిల భారత భీమా ఉద్యోగుల సంఘం(ఏఐఐఈఏ)ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నల్లగొండలోని ఎల్ఐసీ బ్రాంచ్1 కార్యాలయ ప్రాంగణంలో సంఘ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీఈయూ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ పెరుమాళ్ల మల్లేశం సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీఈయూ నల్లగొండ బ్రాంచ్1 అధ్యక్షుడు కొప్పు వెంకన్న,కార్యదర్శి ఐతగోని లక్ష్మీనారాయణ,రిటైర్డ్ ఉద్యోగి వేముల కృష్ణయ్య, ఏఏఓలు కరుణ,వంశీకృష్ణారెడ్డి ఐసీఈయూ ప్రతినిధులు ఎస్. సందీప్,పల్లపు లింగయ్య,ఎం. రామకృష్ణ, గుండగోని శ్రీనివాస్,వింజమూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.




# నల్లగొండ యువతి ... అమెరికాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం

### జిల్లా గర్వించే క్షణం...
### నల్లగొండకు కీర్తి తెచ్చిన డాక్టర్ హిమని

**ప్రజాపక్షం/నల్లగొండ :** స్థానిక పాఠశాలలో విద్యాభ్యాసాన్ని ప్రారంభించి,ప్రపంచ ప్రఖ్యాత అమెరికన్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలిగా ఎదిగిన నల్లగొండ యువతి డాక్టర్ అనంతుల హిమని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. అమెరికాలోని ప్రముఖ కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆమె,మిచిగన్ స్టేట్ యూనివర్సిటీలోని ఎలీ బ్రాడ్ కాలేజ్ ఆఫ్ బిజినెస్‌లో అసిస్టెంట్ ప్రొఫసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.



**నల్లగొండలోనే పునాది..**
**ప్రపంచ స్థాయి విజయానికి నాంది**

నల్లగొండ జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి కె.వి కృష్ణవేణి,సీనియర్ అడ్వకేట్ అనంతుల శంకరయ్య దంపతుల కుమార్తె అయిన హిమని తన ప్రాథమిక,మాధ్యమిక విద్యను నల్లగొండలోని కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్‌లో పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి,ఐఐటీజేఈఈలో ఆల్ ఇండియా 622వ ర్యాంకు సాధించారు.దీంతో ఐఐటీ బాంబేలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందారు.కార్పొరేట్ ఉద్యోగం నుంచి పరిశోధన రంగంలోకి ఇంజినీరింగ్ పూర్తి చేసిన అనంతరం ఓలా క్యాబ్స్‌లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన హిమని,పరిశోధనలపై ఆసక్తితో ఆరంగంలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పరిశోధనలో తన ప్రతిభను చాటుకున్నారు.ప్రముఖ అధ్యాపకులు ప్రొఫసర్ అచల్ బస్సాంబూ,ప్రొఫసర్ మిలింద్ సోహోని మార్గదర్శకత్వంలో ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

**తెలంగాణ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం**

అమెరికాలో ఉన్నత విద్య, పరిశోధన అవకాశాలు ప్రతిభ, పట్టుదల ఉన్న ప్రతి విద్యార్థికి అందుబాటులోనే ఉన్నాయని డాక్టర్ హిమని పేర్కొన్నారు.అమెరికాలోని అనేక అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు పూర్తిగా నిధులతో నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పూర్తి ట్యూషన్ ఫీజు మాఫీతో పాటు నెలవారీ స్టైపెండ్, ఆరోగ్య బీమా,పరిశోధన సహాయం వంటి సౌకర్యాలు లభిస్తాయని వివరించారు.

**నల్లగొండ జిల్లాకు గర్వకారణం**

స్థానిక విద్యాసంస్థల నుంచి విద్యాభ్యాసాన్ని ప్రారంభించి,ప్రపంచ స్థాయి బిజినెస్ స్కూల్‌లో అధ్యాపకురాలిగా ఎదిగిన డాక్టర్ అనంతుల హిమని విజయం నల్లగొండ జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.ప్రపంచ స్థాయిలో రాణించాలని కలలు కనే విద్యార్థులకు ఆమె ప్రయాణం స్ఫూర్తిగా, మార్గదర్శకంగా నిలుస్తుందని విద్యావేత్తలు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు.

# నరసింహ మృతి సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని తానేదార్ పల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు వట్టికోటి నరసింహ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు.మృతదేహంపై సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్,కౌన్సిల్ సభ్యుడు బిక్షం రెడ్డి,కార్యవర్గ సభ్యుడు ఎరుకలి నిరంజన్,గ్రామ శాఖ కార్యదర్శి అంజయ్య ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ సిపిఐ నాయకుడు మునగాల చలపతిరావుతో కలిసి భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నరసింహ ఎదురొడ్డి పోరాడారు.ఆయన మరణం తానేదార్‌పల్లి గ్రామానికి,పార్టీకి తీరని లోటు అని కొనియాడారు.



కర్నాటి అంజయ్య,దేవేందర్,యాదయ్య, పార్టీ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**ప్రజాపక్షం/రామన్నపేట :** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బెస్ట్ సేవా సొసైటీ వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య అన్నారు.బుధవారం రామన్నపేట మండలంలోని కక్కిరేణి హై స్కూల్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు డైరీలు, భోజనం ప్లేట్స్ స్టేషనరీ తదితర సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయులు సి.యచ్ రాజన్ బాబు మాట్లాడుతూ స్వంత ఊరి మనకారంతో బెస్ట్ సేవా సోసైటి వ్యవస్థాపకులు బుక్కా ఈశ్వరయ్య హైస్కూల్, ప్రైమరిస్కూల్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం సహయ సహకారాలు అందించడం గర్వించదగ్గ విషయమని అన్నారు.



## అవకతవకలకు తావులేదు

**ప్రజాపక్షం/వేములపల్లి :** మండలంలో జరుగుతున్న సమగ్ర ఇన్ఫర్మేషన్ రీసెర్చ్ సర్వేను పకడ్బందీగా,ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని ఆర్డీవో రమణారెడ్డి అధికారులను హెచ్చరించారు. బుధవారం మొల్కపట్నం, శెట్టిపాలెం గ్రామాల్లో తాహశిల్దార్ హేమలతతో కలిసి ఆయన ఆకస్మికంగా పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా నమోదు చేయాలని,నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బీఎల్‌ఓలకు స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఆర్ఐ మహేందర్ రెడ్డి, బీఎల్‌ఓలు రజిత, విమల పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం



**ప్రజాపక్షం/వేములపల్లి :** మండల కేంద్రంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం, మొల్కపట్నం గ్రామానికి చెందిన పోతనబోయిన వంశీ (19) మిర్యాలగూడ వైపు నుంచి నల్లగొండ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది.ఈప్రమాదంలో కంటైనర్ రెండు చక్రాలు వంశీ తలపై నుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్న వంశీ,ఏదో పని మీద సొంతూరుకు వచ్చి ఇలా అర్ధాంతరంగా మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/దేవరకొండ;** ఏబివిపి దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా కార్యక్రమం చేస్తున్న సమయంలో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు అని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న ఏబివిపి కార్యకర్తలపై లాఠీచార్జీని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏబివిపి రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపిచంద్ అన్నారు. అడ్మిషన్ సమయంలో పూర్తి ఫీజు వసూలు చేయడం అన్యాయం అని, ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబివిపి ఆధ్వర్యంలో దేవరకొండ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై విద్యార్థులతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో నగర కార్యదర్శి విక్రమ్, జాయింట్ సెక్రటరీ హేమసుందర్, వినయ్, నగర కార్యవర్గ సభ్యులు బిట్టు, సాయి, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా వేణుగోపాల్ రావు బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండల తహసీల్దార్‌గా వేణుగోపాల్ రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన లాక్కారాజు వెంకటేశ్వరావు సోమవారం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వేణుగోపాల్ రావు నియమితులయ్యారు.బాధ్యతల స్వీకరణ అనంతరం కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరావును సిబ్బంది ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మరోసారి బాధ్యతలు చేపట్టిన రాందాస్ శ్రీనివాస్,మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అధ్యక్షుడిగా మరోసారి అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేస్తాం. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తాం అని ఆయన స్పష్టం చేశారు.



# జీవితాలలకు జీవం పోసేది డాక్టర్లే




ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సకాలంలో వైద్యం అందించి జీవితాలకు జీవం పోసేది డాక్టర్లేనని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బుధవారం నకిరేకల్ పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో కలిసి కేక్ కట్ చేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు.డాక్టర్లు అందిస్తున్న సేవలను వెలకట్టలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగుల వంచ వెంకటేశ్వరరావు,ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి,ఆర్ఎంఓ డాక్టర్ స్వాతి, డాక్టర్లు వెంకటరమణ,శ్రీకాంత్,కరణ్‌కుమార్,రాజ్‌కుమార్,స్పందన,శ్యామ్,నాయకులు పన్నాల రాఘవరెడ్డి,చౌగోని శ్రీనివాస్,గాజుల శ్రీనివాస్,ఎల్లపురెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు నిరంతరం ఆరోగ్య రక్షణ కల్పిస్తూ, ప్రాణాలు కాపాడుతున్న వైద్యుల సేవలు అమూల్యమైనవని లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ అధ్యక్షులు కూటాల రాంబాబు కొనియాడారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ అశ్విన్ కుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ జాడి రాజు, డాక్టర్ మహానంది చౌదరి, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సుష్మ, డాక్టర్ స్వాతి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఉజ్వల, డాక్టర్ వాసంతి, డాక్టర్ ఇంటూరి శ్రీనివాసరెడ్డిలను ఘనంగా సన్మానించారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యుల సేవలు మరువలేనివని మున్సిపల్ కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ గౌడ్ కొనియాడారు.డాక్టర్స్ డే సందర్భంగా బుధవారం విద్యానగర్ పార్క్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో 47వ డివిజన్ విద్యానగర్ పార్కులో పలువురు వైద్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పార్క్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు బి.వీరారెడ్డి,ప్రధాన కార్యదర్శి పంతులు శ్రీనివాసులు, నవీన్ రెడ్డి, భూపాల్ రెడ్డి,అబ్బగోని రమేష్ గౌడ్,తుమ్మల వీరారెడ్డి,మేడం మోహన్ రెడ్డి,చకిలం వేణుగోపాలరావు,వీరమల్ల వెంకటరమణ,శంకర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి :** జాతీయ డాక్టర్స్ డే సందర్భంగామండలంలోని ప్రముఖ వైద్యులను మాంద్ర శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం అర్చకులు బ్రహ్మశ్రీ ఉత్తరపల్లి నరసింహాచార్యులు మంగళవారం వేదమంత్రాలతో ఆశీర్వదించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలోసన్మానం పొందిన వైద్యులు వనం యాదగిరి,ప్రసాద్,మార్కు నారాయణ,చంద్రమౌళి,వెంకన్న తోపాటు మైత్రి మెడికల్ హాల్,చిరంజీవి మెడికల్ హాల్,మార్కు నారాయణ మెడికల్ హాల్ సిబ్బంది పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.





**ప్రజాపక్షం/రామన్నపేట :** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రామన్నపేట ఏరియా ఆసుపత్రిలో సేవలందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లుతోపాటు డా.మాధవాచారి, డా. అహ్మద్ అలీ, డా.ఆదిల్,డా.శ్వేత ప్రియాంక, డా.నవీన్, డా.ఉదయ్ , నర్సింగ్ సిబ్బందిని వివేకానంద డివైన్ మోడల్ స్కూల్ వ్యవస్థాపకులు టీ.మల్లికార్జున్, హెడ్మాస్టర్ వి.మల్లేష్, ఉపాధ్యాయులు కే.నాగరాజు,కే సాయి , విద్యార్థిని విద్యార్థులు డాక్టర్లని ఘనంగా సత్కరించారు. విద్యార్థినీ విద్యార్థులు వైద్యులకి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైద్యులకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,ఆసుపత్రి వైద్యులు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా తుర్కపల్లి కాంగ్రెస్ నాయకులు, సుశ్రుత వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు లయన్ చెన్నకిష్టయ్యను కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాడోత్ సుధాకర్ నాయక్, బిల్య నాయక్ తండా గ్రామ శాఖ అధ్యక్షులు గుగులోత్ తరుణ్ నాయక్ పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/మునగాల:** సమాజంలో వైద్యుల సేవలు వెలకట్టలేనిదని సర్పంచ్ వేమూరి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆకుపాముల పల్లెదావఖానలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ దివ్యను నర్సింహాపురం సర్పంచ్ వేమూరి సత్యనారాయణ శాలువాతో సన్మానించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అజీజ్‌మియా, వీరబోయిన వినోద్, ఎఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు సునిత, సుభద్ర పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బుధవారం నేరేడుచర్ల వాసవి క్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. డాక్టర్ నాగిని, డాక్టర్ శృతి, డాక్టర్ సాయిరాం, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అఖిల్ లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షులు నీలా రామ్మూర్తి, చారుగండ్ల వెంకటేశ్వర్లు, కందిబండ శ్రీనివాసరావు, కొత్త లక్ష్మ ణ్, ఉట్కూరు నటరాజ్, గెల్లి లక్ష్మి నర్సింహరావు, నీలా శ్రీనివాస్, జులూరు అశో, తాళ్లూరి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యం, వీరవెల్లి శ్రీనివాస్, స్వామి, గజ్జల కోటేశ్వరరావు, శివానీ, శ్రీలత పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండల పరిధిలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్‌కు ఆరోగ్య సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పద్మ, నర్సింగ్ ఆఫీసర్లు మరియమ్మ, శివకుమార్, ఫార్మసి ఆఫీసర్ సంతోషి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్స్ డే సందర్భంగా సూర్యాపేట జిల్లా కోర్టు హెల్త్ సెంటర్ డాక్టర్ స్రవంతి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ గౌరవ అధ్యక్షులు ఉమ్మెత్తల వెంకటేశ్వరరావు, అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తొగిటి మురళీ, మీలా రమేష్, దయాకర్ రావు, మహిళా న్యాయవాదులు అస్మాజబీన్, కూచిపూడి శశిరేఖ, జుస్మిత, శ్రీజ, హెల్త్ అసిస్టెంట్ స్వప్న, కృష్ణ పాల్గొన్నారు.






## తప్పుల్లేకుండా విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ ప్రక్రియను తప్పుల్లేకుండా విజయవంతం చేయాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి రాజకీయ పార్టీల నాయకులను కోరారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నప్పుడు రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. ప్రజలు కూడా ఫారాలను జాగ్రత్తగా నింపేలా అవగాహన కల్పించాలన్నారు.సమావేశంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ నాగమణిలతో పాటు వివిధ పార్టీల నాయకులు పాతూరి శరత్, ఎం. రవినాయక్, అశోక్ రెడ్డి, నాగిరెడ్డి, క్రాంతికుమార్, దినేష్, గాలిబ్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించి,కొత్తగా అమల్లోకి తెచ్చిన విబి గ్రామ్ జి పథకాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు.బుధవారం నకిరేకల్ పట్టణ కేంద్రంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర కమిటీ పిలుపు మేరకు నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచకొండ వెంకట్ గౌడ్,సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఒంటెపాక వెంకటేశ్వర్లు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మర్రి వెంకటయ్య,గింజల లక్ష్మి,ఒంటెపాక కృష్ణ,చెన్నబోయిన నాగమణి,బహురోజు ఇందిరా,దోరేపల్లి ఎల్లయ్య,బండమీది ఎల్లయ్య, గురుజా స్వరూప,పన్నాల శశికళ,భిక్షంరెడ్డి,జమదగ్ని, మర్రి బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చందంపేట;** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజి రాంజీ బిల్లును తక్షణమే ఉప సంహరించుకోవాలని కోరుతూ బుధవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శంకర్‌నాయక్, సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, బిక్షమయ్య, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా వెంకటనారాయణ రెడ్డి,మొగులయ్య

**ప్రజాపక్షం/నకిరేకల్ :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు నూకల వెంకటనారాయణ రెడ్డి,నకిరేకంటి మొగులయ్యలను రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు బుధవారం నియమించారు.ఈసందర్భంగా ఇద్దరూ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర,జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.వీరు గతంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. పార్టీ బలోపేతం,అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ కార్యకర్తగా ముందుండి పని చేస్తామని తెలిపారు.వీరి నియామకం పట్ల ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న,జిల్లా,మండల నాయకులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.